# కరెంట్ అఫైర్స్

## 'ద న్యూయార్క్ టైమ్స్' జాబితాలో హంపి

- ★ 2019లో తప్పనిసరిగా చూడాల్సిన 52 ప్రపంచ దర్శనీయ స్థలాలతో 'ద న్యూయార్క్ టైమ్స్' రూపొందించిన జాబితాలో కర్ణాటకలోని హంపి నగరం రెండో స్థానంలో నిలిచింది. మన దేశం నుంచి హంపి ఒక్కటే ఈ జాబితాలో చోటు పొందింది.
- ★ అలనాటి విజయనగర సామ్రాజ్యం, ప్రపంచంలోనే అతిపెద్ద ఆరు బయటి పర్యాటక ప్రదేశంగా సందర్శకుల్ని అమితంగా ఆకట్టుకునే హంపి తుంగభద్ర తీరంలో దాదాపు 26 కి.మీ. పొడవున విస్తరించి ఉంది. 2016-17లో సుమారు 5.35 లక్షల మంది హంపిని సందర్శించారు. వీరిలో 38 వేల మంది విదేశీ పర్యాటకులు ఉన్నారు.
- ★ ఈ జాబితాలో కరీబియన్ ద్వీపం ప్యూర్టోరికో అగ్రస్థానంలో ఉంది. మూడు, నాలుగు, అయిదు స్థానాల్లో వరుసగా శాంటాబార్బరా, పనామా, మ్యూనిచ్‌లు ఉన్నాయి.

## 124వ రాజ్యాంగ సవరణ బిల్లు

- ★ ఆర్థికంగా వెనుకబడిన తరగతులకు జనరల్ కోటాలో 10% రిజర్వేషన్లు కల్పించడానికి ఉద్దేశించిన 124వ రాజ్యాంగ సవరణ బిల్లుకు 2019, జనవరి 8న లోక్‌సభ, 9న రాజ్యసభ ఆమోదం తెలిపాయి. లోక్‌సభలో 323-3 ఓట్లు, రాజ్యసభలో 165-7 ఓట్ల తేడాతో ఈ బిల్లు ఆమోదం పొందింది.
- ★ ఆర్టికల్-368 ప్రకారం పార్లమెంట్‌కు రాజ్యాంగంలోని ఏ భాగాన్నయినా సవరించే పూర్తి అధికారాలున్నాయి. మౌలిక స్వరూపం మినహా మిగతావన్నీ సవరించవచ్చు.
- ★ ఈ బిల్లుకు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ జనవరి 12న ఆమోదముద్ర వేశారు. 124వ రాజ్యాంగ సవరణ బిల్లుగా పార్లమెంట్ ఆమోదం పొందిన ఈ అంశం రాష్ట్రపతి ఆమోదముద్రతో 103వ రాజ్యాంగ సవరణ చట్టంగా మారింది. రిజర్వేషన్ల కల్పన కోసం రాజ్యాంగంలోని 15, 16 అధికరణలను సవరించాల్సి వచ్చింది.

## ప్రకాశం జిల్లాలో రెండు కీలకమైన ప్రాజెక్టులు

- ★ ప్రకాశం జిల్లా కందుకూరు నియోజకవర్గ పరిధిలో 2019, జనవరి 9న ముఖ్యమంత్రి చంద్రబాబు ఆసియా పల్ప్ అండ్ పేపర్ (ఏపీపీ) మిల్లు, రామాయపట్నం పోర్టులకు శంకుస్థాపన చేసి పైలాన్లను ఆవిష్కరించారు.
- ★ ఇండోనేషియా సంస్థ ఆసియా పల్ప్ అండ్ పేపర్ (ఏపీపీ) భారతదేశంలో అతిపెద్ద విదేశీ ప్రత్యక్ష పెట్టుబడితో (రూ. 24,500 కోట్లు) తన కర్మాగారాన్ని నెలకొల్పుతోంది. ఏపీపీ 120 దేశాల్లో విస్తరించి ఉంది.
- ★ అత్యంత అభివృద్ధికారక ప్రాజెక్టు అయిన రామాయపట్నం పోర్ట్ ఆంధ్రప్రదేశ్‌లో 15వది. దీన్ని రూ. 5,000 కోట్ల ప్రాథమిక పెట్టుబడితో ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్మించనున్నారు. ఇది ప్రత్యక్షంగా, పరోక్షంగా 25,000 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పిస్తుంది.

## గోల్డెన్ గ్లోబ్ పురస్కారాలు - 2019

- ★ ప్రతిష్ఠాత్మక 76వ గోల్డెన్ గ్లోబ్ పురస్కారాలను 2019, జనవరి 7న కాలిఫోర్నియాలోని బెవర్లీ హిల్స్ నగరంలో ప్రదానం చేశారు. అమెరికన్ హాస్య ప్రధాన చిత్రం 'గ్రీన్‌బుక్' మూడు పురస్కారాలతో అగ్రస్థానం దక్కించుకుంది. ఆ తర్వాతి స్థానాల్లో, బ్రిటిష్ చిత్రం 'బొహేమియన్ రాప్సోడీ, స్పానిష్ చిత్రం 'రోమా' చెరో రెండు పురస్కారాలను పొందాయి.
- ★ ఉత్తమ చిత్రం (డ్రామా): బొహేమియన్ రాప్సోడీ
- ★ ఉత్తమ చిత్రం (మ్యూజికల్/కామెడీ): గ్రీన్‌బుక్
- ★ ఉత్తమ నటుడు (డ్రామా): రమి మలెక్ (బొహేమియన్ రాప్సోడీ)
- ★ ఉత్తమ నటుడు (మ్యూజికల్/కామెడీ): క్రిస్టియన్ బాలె (వైస్)
- ★ ఉత్తమ నటి (డ్రామా): గ్లెన్ క్లోజ్ (ది వైఫ్)


wwww.eenadupratibha.net

★ ఉత్తమ నటి (మ్యూజికల్/కామెడీ): ఒలీవియా కోల్‌మన్ (ది ఫేవరెట్)

★ ఉత్తమ విదేశీ భాషా చిత్రం: రోమా (స్పానిష్)

★ ఉత్తమ దర్శకుడు: అల్ఫొన్సో కౌరాన్ (రోమా)

★ ఉత్తమ యానిమేషన్ చిత్రం: స్పైడర్‌మ్యాన్: ఇన్‌టుది స్పైడర్ వెర్స్

## ఆస్ట్రేలియాలో భారత్ తొలి టెస్ట్ సిరీస్ విజయం

★ ఇటీవల ఆస్ట్రేలియాలో జరిగిన 4 టెస్టు మ్యాచ్‌ల సిరీస్‌ను టీమిండియా 2-1తో నెగ్గి బోర్డర్-గావస్కర్ ట్రోఫీని కైవసం చేసుకుంది.

★ 1947-48లో తొలిసారి ఆసీస్‌లో పర్యటించిన టీమిండియా 71 ఏళ్ల తర్వాత 12వ పర్యటనలో తొలిసారి టెస్ట్ సిరీస్‌ను గెలుచుకుంది. తద్వారా ఆస్ట్రేలియాలో టెస్టు సిరీస్ నెగ్గిన తొలి ఆసియా జట్టుగా రికార్డులకెక్కింది. 1980-81, 2003-04లలో ఆస్ట్రేలియాలో జరిగిన టెస్టు సిరీస్‌లను భారత్ డ్రాగా ముగించింది.

★ 'మ్యాన్ ఆఫ్ ది సిరీస్' ఛతేశ్వర్ పుజారాకు దక్కింది. నాలుగు టెస్టుల్లో మూడు శతకాలు చేసి 74.42 సగటుతో పుజారా 521 పరుగులు చేశాడు.

★ తాజా సిరీస్‌లో వికెట్ కీపర్ రిషభ్ పంత్ 20 క్యాచ్‌లతో ఓ టెస్టు సిరీస్‌లో అత్యధిక క్యాచ్‌లు అందుకున్న భారత వికెట్ కీపర్‌గా రికార్డు నమోదు చేశాడు.

## చంద్రుడి అవతలి భాగంలో దిగిన చాంగే-4

★ ప్రపంచంలోనే మొదటగా చంద్రుడి అవతలి భాగంలో 2019, జనవరి 3న చాంగే-4 వ్యోమనౌకను దించిన చైనా అంతరిక్ష పరిశోధనల్లో విజయాన్ని నమోదు చేసింది.

★ చంద్రుడి అవతలి భాగంలో ముందుగా నిర్దేశించిన రీతిలో దక్షిణ ధ్రువ-అయిట్కెన్ బేసిన్‌లోని వాన్ కార్మాన్ బిలంలో చాంగే-4 సురక్షితంగా దిగింది. 186 కి.మీ. వెడల్పు, 12 కి.మీ. లోతు ఉన్న ఈ బిలం సౌర కుటుంబంలోని అతిపెద్ద బిలాల్లో ఒకటి. ఖగోళ శిల ఢీ వల్ల ఇది ఏర్పడింది.

★ చైనా జానపద కథల్లోని చందమామ దేవత పేరిట ఈ వ్యోమనౌకకు చాంగే-4 అనే పేరు పెట్టారు.

## ప్రపంచ ఆర్థిక వేదిక తాజా నివేదిక

★ అమెరికా, చైనా తర్వాత మూడో అతిపెద్ద వినియోగ విపణిగా భారత్ అవతరించబోతోందని ప్రపంచ ఆర్థిక వేదిక (WEF) తన తాజా నివేదికలో అంచనా వేసింది. దేశీయంగా వినియోగదారుల వ్యయాలు పెరుగుతుండటం దీనికి కారణంగా విశ్లేషించింది.

★ ప్రస్తుతం దేశీయ వినియోగదారుల వ్యయాలు 1.5 లక్షల కోట్ల డాలర్ల (సుమారు రూ.105 లక్షల కోట్లు) నుంచి 2030 నాటికి 6 లక్షల కోట్ల డాలర్లకు (సుమారు రూ.420 లక్షల కోట్లు) పెరిగే అవకాశం ఉందని అంచనా వేసింది.

★ ప్రస్తుతం 7.5 శాతం వార్షిక జీడీపీ వృద్ధిరేటుతో భారత్ ప్రపంచంలోనే అతిపెద్ద ఆరో ఆర్థిక వ్యవస్థగా కొనసాగుతోందని పేర్కొంది.

## మాదిరి ప్రశ్నలు

**1.** 2018 సంవత్సరానికి గ్లోబల్ వాల్యుయేషన్, కార్పొరేట్ ఫైనాన్స్ అడ్వయిజర్స్ సంస్థ డఫ్ అండ్ ఫెల్ప్స్ రూపొందించిన 'భారత్‌లో అత్యధిక బ్రాండ్ విలువ ఉన్న సెలబ్రిటీల జాబితా'లో అగ్ర స్థానంలో ఎవరు నిలిచారు?

1) విరాట్ కోహ్లీ 2) దీపికా పదుకొనె 3) అక్షయ్‌కుమార్ 4) షారుక్‌ఖాన్

**2.** ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2018-19)లో భారత జీడీపీ ఎంత శాతం మేర వృద్ధి చెందవచ్చని ప్రపంచ బ్యాంకు తన తాజా అంచనాల్లో పేర్కొంది?

1) 7.1% 2) 7.3% 3) 7.5% 4) 7.7%

**3.** దేశంలో డిజిటల్ చెల్లింపుల భద్రతను మరింత పటిష్ఠం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలను సూచించేందుకు ఎవరి ఆధ్వర్యంలో అత్యున్నత స్థాయి అయిదుగురు సభ్యుల కమిటీని ఆర్‌బీఐ నియమించింది?

1) రతన్‌టాటా 2) చేతన్ భగత్ 3) ముఖేష్ అంబానీ 4) నందన్ నీలేకని

**4.** అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) ప్రధాన ఆర్థికవేత్తగా 2019, జనవరి 1న బాధ్యతలు చేపట్టిన భారతీయ అమెరికన్ అర్థశాస్త్ర నిపుణురాలు?

1) అరుంధతీ భట్టాచార్య 2) ప్రియాగిల్ 3) గీతా గోపీనాథ్ 4) స్వాతి మంద్రేకర్

**5.** కింది అంశాల్లో సరైనవి.

ఎ) చైనాలో భారత రాయబారిగా విక్రమ్ మిస్రీ 2019, జనవరి 7న బాధ్యతలు స్వీకరించారు.

బి) విక్రమ్ మిస్రీ ఈ పదవి చేపట్టకముందు మయన్మార్‌లో భారత రాయబారిగా పనిచేశారు

సి) జైశంకర్ స్థానంలో చైనాలో భారత రాయబారిగా విక్రమ్ మిస్రీ బాధ్యతలు స్వీకరించారు.

1) ఎ మాత్రమే 2) ఎ, బి మాత్రమే 3) ఎ, సి మాత్రమే 4) అన్నీ

**6.** భారత పర్యటనలో భాగంగా 2019, జనవరి 8న దిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీతో సమావేశమైన ఇర్నా సోల్బెర్గ్ నార్వేకు ఎన్నో మహిళా ప్రధాన మంత్రి?

1) మొదటి 2) రెండవ 3) మూడవ 4) నాల్గవ

**7.** పాకిస్థాన్, బంగ్లాదేశ్, అఫ్గానిస్థాన్‌లకు చెందిన ముస్లిమేతరులకు భారత పౌరసత్వం కల్పించేందుకు ఉద్దేశించిన 'పౌరసత్వ సవరణ బిల్లు-2018'ను లోక్‌సభ ఏ రోజున ఆమోదించింది?

1) 2019, జనవరి 5 2) 2019, జనవరి 6

3) 2019, జనవరి 7 4) 2019, జనవరి 8

**8.** 2019, జనవరి 6న ఏ దేశ రాజు అయిన సుల్తాన్ మహ్మద్ (49) సింహాసనం నుంచి వైదొలిగారు?

1) థాయ్‌లాండ్ 2) మలేసియా 3) సౌదీ అరేబియా 4) కాంబోడియా

**9.** 2019, జనవరి 6 ఉదయం 8 గంటల నుంచి జనవరి 7 ఉదయం 8 గంటల వరకు 24 గంటల వ్యవధిలో పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో ఎన్ని ఘనపు మీటర్ల కాంక్రీటు పనులను చేపట్టి గిన్నిస్ రికార్డు సృష్టించారు?

1) 30,315.15 ఘనపు మీటర్లు 2) 31,315.15 ఘనపు మీటర్లు

3) 32,315.15 ఘనపు మీటర్లు 4) 33,315.15 ఘనపు మీటర్లు

**10.** 'దేశానికి దిక్సూచి తెలంగాణ' పుస్తక రచయిత?

1) దేశపతి శ్రీనివాస్ 2) అందెశ్రీ 3) బీఎస్ రాములు 4) నందిని సిధారెడ్డి

**11.** ప్రో కబడ్డీ లీగ్ సీజన్ 6 విజేత?

1) బెంగళూరు బుల్స్ 2) గుజరాత్ ఫార్చ్యూన్ జెయింట్స్

3) తెలుగు టైటాన్స్ 4) పట్నా పైరేట్స్

వివరణలు:

ప్రశ్న 5: చైనాలో రాయబారిగా పనిచేసిన గౌతం బంబావాలె 2018 నవంబరులో పదవీ విరమణ పొందారు. ఆయన స్థానంలో విక్రమ్ మిస్రీ నియమితులయ్యారు.

ప్రశ్న 6: నార్వే మొదటి మహిళా ప్రధానమంత్రిగా గ్రోహర్లెమ్ బ్రంట్‌లాండ్ పనిచేశారు.

**సమాధానాలు**

1-1; 2-2; 3-4; 4-3; 5-2; 6-2; 7-4; 8-2; 9-3; 10-3; 11-1.

**రచయిత: సీహెచ్. కృష్ణప్రసాద్**